# ప్రాణం ఖరీదు

- మీనాక్షి శ్రీనివాస్

ఓయ్! నర్సింగా జార్తరోయ్... జారేను - రాములయ్య యిలా హెచ్చరించడం ఇది ఎన్నోమారో... లెక్కలేదు.

ఏంది మావ... ఓ గాబరా నువ్వూను. నాకివేమన్నా కొత్తా... యిలాటి యెన్నో చూసాను. అనుభవం యిచ్చిన ధీమా... వయసు యిచ్చిన నిర్లక్ష్యం తొణికాయి నర్సింగ గొంతులో.

నువ్వు మొనగాడివని నాకు తెల్సురోయ్ కానీ అంత ఎత్తులో కట్టిన ఆ తాడుకు తెల్దుగా. ఇదేం సర్కసు కాదురోరే - పరాచికం ఆడుతూనే జాగ్రత్త చెప్పాడు రాములయ్య.

ఓసోసి ఈపాటి ఎత్తుకే... నేను పెద్ద పెద్ద స్టారు హోటేళ్ళు కట్టినోడినన్న సంగతి మరసిపోతే ఎలా మావ - ఆ గొంతులో అద్భుతాన్ని సాధించిన గర్వం. ప్రతిసారీ తను కట్టిన బిల్డింగు పూర్తయిన వెంటనే, అంతటి ఘనకార్యంలో తన కృషి ఉందనే ఆత్మ విశ్వాసం కలుగుతుంది వాడికి.

నర్సింగ పది, పదకొండు ఏళ్ళ వయసు నించే తాపీ పనికి, కట్టడాల పనికి పోయేవాడు. తండ్రి తాగి తాగి అర్ధాంతరంగా చచ్చిపోతే తల్లి ముత్యాలు ఆ యింట్లో ఈ యింట్లో పాచి పనులు చేసి పసివాళ్ళయిన తననూ, తన తమ్ముడు చెల్లిలను ఎంత కష్టపడి పెంచిందీ తెలుసువాడి పసి హృదయానికి. అందుకే అమ్మ వద్దంటున్నా వినక వాడు పసి వయసులోనే మామ రాములయ్యతో కలిసి బిల్డింగు పనులలోకి వెళ్ళేవాడు. చిన్నతనంలోనే తన బతుకు తను బతుకుతూ, తన వాళ్ళను ఆదుకోవడం వలన కలిగిన ఆత్మస్థైర్యం, విశ్వాసం నర్సింగలో ఓ విధమైన గర్వాన్ని నిర్లక్ష్యాన్ని పెంచాయి.

అలా అని వాడు ఎవరినీ నొప్పించడు - నిందించడు, తను ఏదైన చెయ్యగలననే ధీమా, తనకు అన్నీ తెలుసుననే చిరు అహం అంతే.

నర్సింగ పనితనం, కార్యదీక్ష, దక్షత తెల్సున్న పెద్ద పెద్ద బిల్డింగ్ కంట్రాక్టర్లు వాడికే పని అప్పచెప్పేస్తారు. అప్పగించిన పని అన్న టైముకు పూర్తి చేసి అప్పచెప్పడం వాడి అలవాటు. అదే వాడి ప్రత్యేకత.

"లాలీ... లాలీ... లాలీ... లాలీ
వటపత్ర శాయికి వరహాల లాలి
రాజీవ నేత్రుడికి రతనాల లాలి" చక్కటి శ్రావ్యమైన గొంతు వాడిది. ఆడుతూ పాడుతూ పనిచెయ్యడం వాడి అలవాటు.

ఏంరోయ్, బుడ్డోడికి లాలి పాటలు నువ్వు పాడుతున్నావా ఏంటి? పాట మహా జోరుగా వస్తోంది - అడిగాడు వెంకటి, నర్సింగ నేస్తం. ఏం లాలి పాటరా... రేతిళ్ళు ఒకటే పోరుపెడుతుండాడు, ఆడితో యింట్లో ఎవరికీ నిద్రుండటం లేదు - కొడుకు ఘనకార్యం గురించి చెప్పడంలోని హాయి పొందుతూ అన్నాడు నర్సింగ. వాడికి కొడుకు పుట్టి నాలుగు నెలలయింది. వాడి భార్య సూర్య చక్కటి చుక్క, ఎవరో కాదు మారు వరసైన రాములయ్య కూతురే. తను కష్టపడి పనిచేస్తూ తమ్ముడిని, చెల్లిని గవర్నమెంటు స్కూల్లో చదివిస్తున్నాడు నర్సింగ.

తల్లిని, పెళ్ళాం సూర్యను కూడా పనుల్లోకి పోనీయడు, పొదుపుగా పద్ధతిగా ఉంటూ గవర్నమెంట్ బంజరు భూములు పేదోళ్ళకి పంచినప్పుడు తనూ ఒకటి తీసుకుని అందులోనే సొంతంగా చిన్న ఇల్లు కూడా కట్టుకున్నాకే పెళ్ళి చేసుకున్నాడు.

చిన్నప్పటి నుంచీ వాడి గురించి తెల్సిన రాములయ్య వాడి మంచితనం, పనితనం, తన వాళ్ళంటే ప్రాణం పెట్టే ఆ ఆత్మీయతలను చూసి తన కూతురు సుఖపడుతుందని నర్సింగను యిచ్చి పెళ్ళి చేశాడు నిరుపేదయినా! ముత్యాలు, సూర్య కూడా తల్లీ బిడ్డల్లా కల్సిమెల్సి ఉంటారు తగవాడుకోకుండా. సాధారణంగా కష్టజీవులకుండే ఏ దురలవాటు నర్సింగకు లేదు.

అరేయ్ నర్సింగా యిక పని ఆపి తిండి తిండానికి పోదాం రా... బాగా ఆకలవుతోంది... అడిగాడు వెంకటి.

ఉండసే... సెంటరింగుని పర్యవేక్షిస్తూ... ఆరోజు దానికి పెట్టిన రాటలు సపోర్టు తీయొచ్చు మధ్యాహ్నం అని ఆలోచిస్తున్నాడు నర్సింగ. సరే...

అంతా బాగానే ఉంది యిహ మధ్యాహ్నంతో సెంటరింగు పని పూర్తయిపోతుంది, పని స్పీడు పెంచితే ఈ నెలాఖరులోగా ఈ బిల్డింగు పూర్తిచేసి ఇంకో పని ఒప్పుకోవచ్చు అనుకుంటూ యిల్లు చేరాడు నర్సింగ.

ఏందిరా నర్సింగా పొద్దుననగాపోయి యిప్పుడా రావడం వేళకి తిండీ తిప్పలూ లేకపోతే నీ ఆరోగ్యమేమవాలే - సున్నితంగా కోప్పడింది ముత్యాలు నర్సింగకు అన్నం పెడుతూ.

కష్టం సుఖం తెల్సి తనంటే ప్రాణం పెట్టే పెద్ద కొడుకంటే ముత్యాలుకి ప్రాణం.

సూర్య బిడ్డకి పాలిస్తూ పక్కనే కూర్చుంది, అన్నం తింటూనే తను కట్టే ఈ బిల్డింగుని వర్ణించి వర్ణించి చెబుతున్నాడు నర్సింగ ఆయిద్దరికీ. పేరుకు బిల్డరూ, ఇంజనీరూ ఉన్నా ఏ బిల్డింగు అయినా ఎక్కువ శ్రమపడేదీ, శ్రద్ధ తీసుకుకట్టేది నర్సింగే. దానికి వాళ్ళిచ్చే కూలీ కన్నా నర్సింగ పొందే ఆత్మానందమే ఎక్కువ ప్రతిఫలం.

మావా, కొత్త బిల్డింగు సూడ్డానికి నన్నూ, అత్తమ్మను ఎప్పుడు తీసుకెళ్తావ్? అడిగింది సూర్య.

ఇంకెంతే ఈ నెలాఖరులోగా మొత్తం పని అయిపోద్ది. రంగులు కూడా ఏసాక సూద్దురు గాని, ఈ దెబ్బతో మన పనితనం యింకా తెలిసొస్తది, యిప్పటకే ఎక్కువ కూలీ యిత్తాం మా ముఠాలోకి రమ్మని ముగ్గురు నలుగురు పెద్ద మేస్త్రీలే అడిగారు కానీ ఎట్టా రాములు మామ పనికాదని యింకో సోటికి పోడం అందుకే కుదరదని సెప్పేసా - అన్నం తినడం పూర్తి చేసి లేస్తూ చెప్పాడు నర్సింగ.

ఈ ఏలన్నా బేగరారా... పాపం నీతో కల్సి సినేమాకు పోవాలని ఒకటే అనుకుంటోంది కోడలు. మీరు సరదాగా కల్సి సినిమాకెళ్ళి శానాళ్ళయింది కదా! సూర్య మనసులో ఆశ కనిపెట్టి కొడుకుకు చెప్పింది ముత్యాలు.

ఈ యేలా? ఎట్టానే అమ్మా ఈ రోజు సెంటరింగు పని అయిపోవాల సానా పొద్దుపోతది. నా కోసం ఎదురుసూడక మీరు బేగ బువ్వతిని పడుకోండి. ఇంకెంత పది దినాల్లో ఈ పని పూర్తవుతుంది కదా సినేమాకు అప్పుడెల్దాం.. ఏంటే సూర్య... అట్టాగేనా... అట్టా కోపంగా సూడమాంక, మరి యిది ఏగిరం పూర్తయితేనే కదా కొత్త



కంట్రాక్టుకి పోవాల, నా బంగారు కదూ, తల్లి సూడకుండా సూర్య బుగ్గగిల్లి వదిలాడు. మధ్యాహ్నం దాటింది మళ్ళీ బిల్డింగు దగ్గరకొచ్చాడు నర్సింగ... ఆ సరికే అంతా పనుల్లోకి దిగారు.

కిట్టప్పా, వెంకటీ ఓ మారు అటుపోయి ఆ కలప తియ్యండి, మావ నువ్వు యిక్కడ ఈ జాగలో నిలబడు అంటూ అందరికీ సూచనలిస్తున్న నర్సింగ, తను నిలబడ్డ తాడు మీదుగా సెంటరింగు రాట ఒకటి పడిపోవడం గమనించుకోలేదు. పని మీద దృష్టిలో ఉన్న మిగతా వాళ్ళూ చూడలేదు. కన్ను మూసి తెరిచే లోగా అనర్థం జరగనే జరిగిపోయింది.

ఆ రాట తాడు మీదుగా పడిపోవడంతో బాలెన్సు తప్పిన నర్సింగ ఆ నాల్గు అంతస్థుల ఎత్తు మీంచి జారి పడిపోడానికి క్షణం పట్టలేదు. పడిపోతూ పడిపోతూ నర్సింగ పెట్టిన అమ్మా అన్న పొలికేక గాలిలో కల్సిపోయింది తనతోపాటు నర్సింగ ప్రాణాలు కూడా తీసుకుని.

రేయ్, రండ్రా మన నర్సింగ పడిపోయిండ్రా అంటూ మొత్తం పనివాళ్ళంతా బిలబిలలాడుతూ కిందకు చేరారు.

అంత ఎత్తు మీంచి నేలకు తగిలిన తల పగిలి రక్తం ఏరై పారింది; పడీపడటంతోనే నర్సింగ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

నర్సింగా, అన్న, బిడ్డా, అల్లుడా... ఏ పిలుపూ

నర్సింగను చేరలేదు. ఆ దృశ్యం చూడలేక కొందరూ, చూసి తట్టుకోలేక కొందరూ స్పృహ కోల్పోయారు.

రాములయ్య దుఃఖానికి అంతే లేదు. తన చేతుల్లో పెరిగిన నర్సింగ అలా తన కళ్ళ ఎదుటే కుప్పకూలడం ఆ ముసలి గుండె తట్టుకోలేక పోయింది. కొట్టుకోవడం మానేసింది.

క్షణాల్లో వార్త కాంట్రాక్టరుకు, సూపర్‌వైజ్ చేయాల్సిన ఇంజనీరు బాబుకు చేరింది. ఆ సమయంలో అక్కడకు వస్తే ఏం జరుగుతుందో తెల్సిన వాళ్ళు ఆ ఛాయలకు కూడా రాలేదు.

ఏం చెయ్యాలో తెలీని ఆ కూలీ జనంలో నిర్జీవంగా పడి వున్న నర్సింగ శవం ఆగ్రహావేశాలు తెప్పించింది. అప్పటికే పోలీసులకు వార్త అందింది. వెంకటి, కిష్టప్పా పరుగు పరుగున నర్సింగ యింటికి పోయి ముత్యాలుకు వార్త చేరేసారు.

ఆ వార్త వింటూనే సూర్య విరుచుకుపడిపోయింది. చేతిలో చంటి బిడ్డ, పక్కన చిన్న పిల్లలు, స్పృహలో లేని కోడలు. అసలు మనిషినే నిలువునా కూల్చేసే వార్త ముత్యాలు ఏడవడం కూడా మరచిపోయి కొయ్యబారి పోయింది. అంతటి ప్రమాదాన్ని గురించి తెల్సుకున్నాక కూడా అక్కడకు రాని కాంట్రాక్టరు, ఇంజనీర్ల ప్రవర్తన ఆ కూలీ జనాల్ని ఆగ్రహావేశుల్ని చేసింది. వాళ్ళని వెతికి వెంటాడి ప్రమాదస్థలానికి లాక్కొచ్చారు. ఏం చెయ్యాలి? యిప్పుడేం చెయ్యాలి అన్నదే వాళ్ళ మనసులలో ప్రశ్న. బిల్డింగ్ ఓనర్ దగ్గరకు వెళ్ళారు. మంతనాలు జరిగాయి.

ఆ నర్సింగ తాగి పనిలో కొచ్చి ఒళ్ళుపైతెలీక పైనించి పడిపోయాడన్నాడు. ఇన్నాళ్ళూ మంచి పనివాడుగా పేరుబడ్డ నర్సింగ అమాంతం పనిరానివాడుగా, పనికి రానివాడుగా మారిపోయాడు.

ఏదో చెప్పి తప్పించుకోవాలని చూడటం తప్పే. అయినా నిజానికి నర్సింగ అలా ప్రమాదం పాలవడంలో ఓనరు ప్రమేయం ఏముంది? అసలు దగ్గర ఉండి బాధ్యతగా పనిచేయించాల్సిన కాంట్రాక్టరు, ఇంజనీరు ఓ మామూలు కూలీ మీద బాధ్యత వదిలేసి వెళ్ళిపోవడంలోని ఔచిత్యం ఎంత? బాధ్యతగా పనిచెయ్యడం, నైపుణ్యాన్ని, అనుభవాన్ని పనిలో చూపించడమే తప్ప టెక్నికల్‌గా ఏ జ్ఞానమూ, జాగ్రత్తలు తీసుకునే నేర్పు లేని ఓ మామూలు కూలీ మీద అంత బాధ్యత పెట్టి సరైన రక్షణ పద్ధతులు తీసుకోని కాంట్రాక్టరు, యింజనీర్లదా ఆ తప్పు. లేక మీతిమీరిన ఆత్మ విశ్వాసంతో, జాగ్రత్తలు పాటించకుండా నేల విడిచి సాము చేసి ప్రాణాల మీదకు తెచ్చుకున్న నర్సింగదా ఆ తప్పు. ఏది ఏమైనా పోయిన ఆ ప్రాణం తిరిగి వస్తుందా? ఎవరైనా తేగలరా? కేసవుతుందని భయపడి, ఓనరుని భయపెట్టి అందరూ కల్సి మంతనాలు జరిపి నర్సింగ ప్రాణానికి ఓ రేటు కట్టారు. పోయిన ప్రాణం ఎటూ తిరిగి రాదు, యిప్పుడు దక్కింది దక్కించుకోవాలని కూలీ జనం, ఎంతో కొంత కేసవకుండా ఉంటే చాలని యాజమాన్యం నర్సింగ చావుకి వెలకట్టి ఆ కుటుంబానికి జరిగిన అన్యాయానికి రేటు కట్టారు. బోలెడంత గొడవ, గలాటా, ఆరాటం పోరాటాల అనంతరం పోలీసులు పత్రికల వాళ్ళ బారిన పడకుండా మధ్యవర్తుల ప్రమేయంతో ఓ ఒప్పందానికి వచ్చారు.

ఏం జరిగిందో, ఏం జరుగుతోందో తెలియని అయోమయ స్థితిలో ముత్యాలుని, సూర్యని పిలిచి వాళ్ళు అల్లరి పెట్టకుండా ఉండేటట్టు బిల్డింగు ఓనరూ, కాంట్రాక్టరూ కలిసి యాభై వేలు వీళ్ళకు యిచ్చేటట్టు మధ్యవర్తుల ఒప్పందం. అయితే ఆ సమయంలో అంత డబ్బు వాళ్ళకు సరిగా చేరదేమో అని 'విశాల హృదయంతో' వీళ్ళ పేర్న ఆ డబ్బు బ్యాంకిలో ఫిక్సెడ్ చేసేటట్టు నిశ్చయించారు. అంత్యక్రియల ఖర్చు కూడా తామే భరిస్తామన్నారు. ఎన్ని లక్షలు తెచ్చి ముత్యాలు కన్నకడుపు గర్భశోకం తీర్చగలరు? ఎన్ని లక్షలయితే ముక్కు పచ్చలారని సూర్య భవిష్యత్తు బాగు చేయగలరు. ఎన్ని లక్షలు తెచ్చి ఆ పసి గుడ్డుకు తండ్రి ప్రేమ అందించగలరు? అసలు దేనినయినా డబ్బుతో కొనగలం, ఏ కొరతయినా డబ్బుతో తీరుతుంది అనుకోవడమే అమానుషత్వం.

ఎవరు చేసిన తప్పుకు ఎవరికి పడుతోంది శిక్ష!

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.